క్లుప్తంగా

సర్వే పరిశీలన



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్

నల్లగొండ రూరల్ : రుణమాఫీ రాని రైతులు తమ కుటుంబ సభ్యుల నిర్ధారణ పత్రాన్ని సమీప వ్యవసాయ కార్యాలయంలో అందజేయాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని దండంపల్లి గ్రామంలో రుణమాఫీ రానిరైతుల కోసం చేపడుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. కుటుంబ సభ్యుల నిర్ధారణ పత్రంలో రైతు కుటుంబ వివరాలను అందజేయాలని కోరారు. ప్రతి గ్రామానికి మండల వ్యవసాయ అధికారి వచ్చి రుణమాఫీ నిలిచిపోయిన రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఏఈఓ హేమలత తదితరులు ఉన్నారు.

పెరిక గోపాల్‌కు నివాళి



గోపాల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు, స్థానిక ప్రకాశం బజార్ వాణిజ్య సముదాయం వ్యవస్థాపకుడు పెరిక గోపాల్ వర్ధంతిని మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం బజార్‌లోని గోపాల్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, గోపాల్ కుమారులు పెరిక ఉమామహేశ్వర్‌రాజ్, పెరిక కరం జయ్‌రాజ్, వినాయక్‌రాజ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రామగిరిలోని మదర్‌థెరిస్సా ఆశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేసి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో మల్లికార్జున్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బొర్ర సుధాకర్, శౌరయ్య, విలియం, సైదులు, శ్రీకాంత్, శ్రవన్, రాజు, నవీన్, సత్యం వేణు పాల్గొన్నారు.

నోట్‌పుస్తకాలు అందజేత



విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, వాటర్ బాటిళ్లు అందజేస్తున్న హెచ్‌ఎం అంజయ్య

చిట్యాల : మండలంలోని ఏపూరు, పేరేపల్లి గ్రామాలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు దివీస్ లాబొరేటరీస్ లిమిటెడ్ పరిశ్రమ యజమాన్యం ఆధ్వర్యంలో అందజేసిన నోట్ పుస్తకాలు, వాటర్‌బాటిళ్లు, స్కూల్‌బ్యాగ్స్, చెప్పులు మంగళవారం ఆయా పాఠశాల హెచ్‌ఎంలు అంజయ్య, సబీహా, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు మల్లేష్, అహల్య విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షురాలు జి.రజిత, పరిశ్రమ ప్రతినిధులు జి.వెంకటేశ్వర్లు, ఎస్.సాయికృష్ణ పాల్గొన్నారు.

మర్రిగూడ : మండలంలోని సరంపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం యూత్ ఫర్‌సేవా సౌజన్యంతో బీజేపీ మండల నాయకుడు జల్లాకుల సైదులు ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్, స్కేల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బొడ్డు శంకర్, నాయకులు యాదగిరి, భాస్కర్ పాల్గొన్నారు.

డోజర్ ఢీకొని వ్యక్తి మృతి

చండూరు : ప్రమాదవశాత్తు డోజర్ వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాస్కానిగూడెం గ్రామానికి చెందిన వర్కాల సత్తయ్య(56) భార్య యాదమ్మతో కలిసి బైక్‌పై చండూరు వెళ్తున్నాడు. ఈ క్రమంలో చండూరు శ్మశానవాటిక వద్ద రోడ్డు పక్కన నిల్వ ఉన్న చెత్తను జోజర్‌తో మున్సిపల్ డ్రైవర్ ఇరిగి వెంకన్న తరలిస్తున్న క్రమంలో అటుగా వస్తున్న సత్తయ్య బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సత్తయ్యకు, అతడి భార్య యాదమ్మకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలో సత్తయ్య మృతి చెందగా, యాదమ్మ నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. మృతుడి చిన్నకూతురు పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకన్న తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తిప్పర్తి : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఈ ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ లింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ మండలంలోని చందుపట్ల వాగు నుంచి తిప్పర్తి మండల కేంద్రానికి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా మండలంలోని మర్రిగూడెం స్టేజి వద్ద పోలీసులు ట్రాక్టర్‌ను పట్టుకుని డ్రైవర్ రాజుకుమార్, ఓనర్ ఆదిమల్ల నాగయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు

- జీటీ లేచి గుంతలమయంగా మారిన మాంద్ర రహదారి
- దాదాపు 5కిలోమీటర్ల మేర తేలిన కంకర
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



గుంతలమయంగా మారిన రోడ్డులో ప్రయాణిస్తున్న వాహనదారులు



బీటీ లేచి కంకర తేలిన మాంద్ర వెళ్లే రహదారి

నార్కట్‌పల్లి : అధ్వానంగా మారిన రోడ్లలో ప్రయాణాలు సాగించేందుకు మండల ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలోని మాంద్ర గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారి ప్రయాణించాలంటే ప్రాణసంకటంగా మారుతుంది. ఈ రోడ్డులో గతంలో నిర్మించిన బీటీ లేచిపోయి ప్రస్తుతం అధ్వానంగా మారింది. అంతే కాకుండా ఈ రోడ్డులో పరిచిన బీటీ, కంకర లేచి దర్శనమిస్తుంది. వర్షాకాలంలో ఈ రోడ్డు చిత్తడిగా మారి ప్రయాణించేందుకు వీలులేకుండా ఉంటుంది. వర్షాకాలంలో ఈ రోడ్డులో ప్రయాణించాలంటే ద్విచక్ర వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. వర్షాకాలంలో చిత్తడి రోడ్డులో పలువురు జారిపడి గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి. అధ్వానంగా మారిన ఈ రోడ్డులో ప్రతిరోజు అధికారులు, ప్రజాప్రతినిధులు వెళ్తున్నా పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఈ సమస్య మూడు సంవత్సరాలుగా ఉన్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్న ఐదు గ్రామాల ప్రజలు..

మండల కేంద్రమైన నార్కట్‌పల్లి నుంచి మాంద్రకు వెళ్లే రహదారిలో చౌడబావి, సూర్యనగర్, మాంద్ర, తిరుమలగిరి, జువ్విగూడెం గ్రామాలు ఉంటాయి. ఈ గ్రామాలకు మండల కేంద్రం నుంచి సుమారు 11కిలోమీటర్ల మేర వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ఈ ఐదు గ్రామాల ప్రజలు గుంతల రోడ్డులో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే ఈ రోడ్డులో ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచి కానరాక వాహనదారులు ప్రమాదాల బారిన పడిన సందర్భాలు ఉన్నాయి.

ఆ గ్రామాలకు ఆటోలే దిక్కు..

గతంలో ఆయా గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించిన ఆర్టీసీ అధికారులు రోడ్డు సరిగా లేకపోవడంతో బస్సు సర్వీసును నిలిపివేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే ఆటోలే దిక్కుగా మారింది. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ఆటో ప్రయాణం చేసే ప్రజలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే నూతనంగా బీటీరోడ్డు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



మాంద్ర గ్రామం నుంచి మండల కేంద్రమైన నార్కట్‌పల్లికి 5కిలోమీటర్లు ప్రయాణం సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నాం. ఈ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారడంతో గాయాలపాలవుతున్నాం. రోడ్డు మరమ్మతులపై అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా రోడ్డు మరమ్మతులు చేసి సమస్యలు పరిష్కరించాలి. గ్రామానికి గతంలో బస్సు సౌకర్యం ఉండేది, ప్రస్తుతం ఆటోలో ప్రయాణం చేయాల్సివస్తుంది.

– అల్‌దాస్ మహేష్, మాంద్ర

పలుమార్లు అధికారులకు విన్నవించాం



రోడ్డు అధ్వానంగా మారిన విషయాన్ని గతంలో పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించాం. వారు ఇప్పటికీ పట్టించుకోలేదు. ఈ రోడ్డులో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై ప్రస్తుత ఎమ్మెల్యే దృష్టికి కూడా తీసుకెళ్లాం. వారు సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

– దొండ సౌమ్య, మాజీ సర్పంచ్ మాంద్ర

సీఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



బాధితులకు చెక్కులు అందజేస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : సీఎం సహాయనిధిని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. అనారోగ్య సమస్యలతో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన 23మంది నిరుపేదలకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.8లక్షల 56వేల 500విలువ గల చెక్కులను మంగళవారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి ద్వారా లక్షలాది మంది పేదలకు సాయం అందుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన చెక్కులను కూడా సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రజిత వెంకట్‌రెడ్డి, పాదూరి ఇంద్రసేనారెడ్డి, నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, సైదులుగౌడ్, సత్యనారాయణ, బొంత శ్రీను, శిరస్సు సత్తయ్య, యాదగిరి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకారాలు అందించాలి

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు : ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహాయ, సహకారాలు అందించాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో నాంపల్లి మండలానికి చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అతిత్వరలో గ్రామాల అభివృద్ధికి గ్రామ అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆ వెంటనే ప్రతి గ్రామంలో నెలకొన్న విద్యుత్, రోడ్ల సమస్యలతో పాటు ఇతర సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం తాను సంబంధిత అధికారులతో మాట్లాడి అందుకు అవసరమైన నిధులు మంజూరు చేయించి గ్రామాల్లోని సమస్యలను పరిష్కరిస్తానన్నారు. సమావేశంలో నాంపల్లి మండల కాంగ్రెస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

చండూరు : మండలంలోని గుండ్రపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వచేసిన రేషన్‌బియ్యాన్ని మండల పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వందనపు నరేందర్ గ్రామంలో వినియోగదారుల నుంచి రేషన్‌బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి గ్రామశివారులోని ఓ రహస్య ప్రదేశంలో డంప్ చేశాడు. ఈ విషయంపై పోలీసులకు పక్కా సమాచారం రావడంతో ఎస్‌ఐ వెంకన్న తన సిబ్బందితో తనిఖీలు చేసి 22సంచులలో నిల్వచేసిన 11క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గ్రామాలలో మరోసారి జర్వ సర్వే చేపట్టాలి

- సమీక్ష సమావేశంలో కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి, పక్కన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చండూరు : ఇటీవల జ్వరం కేసులు ఎక్కువగా నమోదైన గ్రామాలలో ఆశా, ఏఎన్‌ఎంలు మరోసారి సర్వే చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. మంగళవారం చండూరు పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆయన వివిధ శాఖల మండల స్థాయి, చండూరు మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో అలాగే చండూరు మండలంలో చేపట్టిన పనులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆయా అంశాలపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాల నిర్మాణాలు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా స్థలాలను చూడాలని, మండలంలోని సబ్ సెంటర్లను సరైన ప్రాంతాలలో నిర్మించేందుకు నాలుగైదు రోజుల్లో స్థలాలు చూడాలన్నారు. కార్యదర్శులు శానిటేషన్, తాగునీరుపై దృష్టి సాధించాలన్నారు. చండూరులోని ఉన్నత పాఠశాల మరో రెండు పాఠశాలలపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించి నాణ్యతపై దృష్టి సారించాలన్నారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్ ఉండేలా చూడాలని, అలాగే ల్యాబ్‌లు కనీసం మూడు క్రీడలపై సామగ్రి ఏర్పాటు చేయాలని, ప్రత్యేకించి చండూరు హైస్కూల్‌పై ఎక్కువ దృష్టి సారించాలన్నారు. ధరణికి సంబంధించి ఒక్కో గ్రామంలో సర్వేనంబర్ వారీగా చూడాలని, ప్రభుత్వ సర్వే నంబర్లను తనిఖీ చేసి వారికి పట్టా పాస్‌పుస్తకాలు ఇచ్చింది లేనిది తనిఖీ చేయాలని ఆదేశించారు. అదే విధంగా వివిధ శాఖలు, వాటి పనితీరుపై ఆయా అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రులలో ప్రసవాల సంఖ్యను పెంచాలని, చండూరు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని 30పడకల ఆస్పత్రిగా పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపాలిటీలో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంటును ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పాట్ల శ్రీనివాస్, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, ప్రజారోగ్య ఈఈ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ మున్వర్, స్థానిక తహసీల్దార్, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది

మర్రిగూడ : పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డిప్యూటీ తహసీల్దార్ జూటూరు తారక రామన్ అన్నారు. మంగళవారం మండలంలోని తిరగండ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముమ్మడి యశోద ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలింతల ఆరోగ్య స్థితిగతులు, చిన్నారుల పెరుగుదలపై పర్యవేక్షించి అనుబంధ ఆహారాలను తీసుకోవాలని అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకోని ఆరోగ్యంగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, నిర్మల పాల్గొన్నారు.



మర్రిగూడ : చిన్నారులకు అన్నప్రాసన చేయిస్తున్న డీటీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్



చిట్యాల : పోషణ్ అభియాన్‌లో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రోజా, అంగన్‌వాడీ సిబ్బంది

చిట్యాల : పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రం-1లో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రోజా మాట్లాడుతూ.. ఏడు నెలల నుంచి మూడేళ్ల పిల్లల వరకు అంగన్‌వాడీ కేంద్రాలలో అందిస్తున్న బాలమృతాన్ని వినియోగించుకోవాలని తల్లులకు సూచించారు. అనంతరం తక్కువ ఖర్చుతో ఎక్కువ కేలరీల శక్తినిచ్చే ఆహార పదార్థాల ప్రదర్శనలో పాల్గొని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ దాడి అరుణ, అపర్ణ, బుజ్జమ్మ, జ్యోతి, శోభారాణి, కృష్ణవేణి, వరమ్మ, పుష్పలత పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కేజీబీవీలో విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా ఉపవైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి

శాలిగౌరారం : కురుస్తున్న వర్షాలతో విషజ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రభుత్వ వైద్యసిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉపవైద్యాధికారి వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పర్యటించిన ఆయన స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని బాత్‌రూంలు, వంటగది, వంట సామగ్రి, తాగునీటి సౌకర్యాలను పరిశీలించారు. అదేవిధంగా విద్యాలయం చుట్టూ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు. తాగునీరు, ఆహారం కలుషితాలు కాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకుని పలువురు విద్యార్థినులను పరీక్షించారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీని సందర్శించి సిబ్బంది హాజరు రిజిస్టర్‌తో పాటు మందుల స్టాక్ రిజిస్టర్, ఓపీ నమోదు రిజిస్టర్ తదితర రికార్డులను ఆయన తనిఖీ చేశారు. పీహెచ్‌సీ సిబ్బంది పనితీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బందిలో కొందరు గ్రూపులను ప్రోత్సహించేలా వ్యవహరిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పీహెచ్‌సీలో 24గంటలు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, మండల వైద్యాధికారి సూర్యశిల్ప, కేజీబీవీ, పీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారు.

చెరువు గండిని పరిశీలించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



అంబారిపేట పెద్దచెరువుకు పడిన గండిని పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈ రాములు, రైతులు

శాలిగౌరారం : ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిస్థాయిలో నిండి గండి పడిన మండలంలోని అంబారిపేట పెద్దచెరువును ఇరిగేషన్ ఏఈ రాములు, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి వేర్వేరుగా రైతులతో కలిసి పరిశీలించారు. 'సాక్షి'దినపత్రికలో మంగళవారం 'అంబారిపేట పెద్దచెరువుకు గండి 'అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. వెంటనే చెరువు వద్దకు వెళ్లి గండిని పరిశీలించారు. గండి ద్వారా బయటకు వెళ్లిన వరద నీటితో దెబ్బతిన్న వరిపంటలను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గండి పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదిక అందజేసి వారి ఆదేశాల అనంతరం గండిపూడ్చే పనులు త్వరితగతిన చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా వరదనీటితో దెబ్బతిన్న పంటల వివరాలను కూడా జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఇదిలా ఉండగా ఇరిగేషన్ ఏఈ రాములు మండలంలోని ఎన్‌జి కొత్తపల్లి కందికుంట చెరువు అలుగును, శాలిగౌరారం ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చే రాచకాల్వ కట్టను పరిశీలించారు. వారివెంట పంచాయతీ కార్యదర్శి వేమారెడ్డి, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ ఎర్ర బుచ్చయ్య, శాలిగౌరారం, అంబారిపేట గ్రామాలకు చెందిన రైతులు చామల వెంకటరమణారెడ్డి, గుత్తా రవీందర్‌రెడ్డి, లింగాల శేఖర్, చిరబోయిన లింగస్వామి, భూపతి చంద్రయ్య, పబ్బు నర్సింహ ఉన్నారు.

బీజేవైఎం ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్‌గా సతీష్‌కుమార్



చిట్యాల : పట్టణానికి చెందిన బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి కంబాలపల్లి సతీష్‌కుమార్ యాదవ్ ఖమ్మం జిల్లా బీజేవైఎం ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మహేందర్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. బీజేవైఎం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అడ్మిషన్లకు స్పెషల్ డ్రైవ్

రామగిరి(నల్లగొండ) : నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో డిగ్రీ అడ్మిషన్ల కోసం దోస్త్ స్పెషల్ డ్రైవ్ విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు 4వ నుంచి 9వ తేదీలోపు దోస్త్ వెబ్‌సైట్‌లో రూ.400 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. దివ్యాంగులు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కేటగిరి ఉన్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు. 9వ తేదీలోపు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలని అదేరోజు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కూడా ఉంటుందని తెలిపారు. 11వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందని.. సీట్లు పొందిన అభ్యర్థులు 13వ తేదీలోపు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్ట్ చేసుకోవాని పేర్కొన్నారు. ఇంతకుముందు అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ చేసుకుని సీట్లు పొందని వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సురభి మణికంఠ

నల్లగొండ టూటౌన్ : మూడు సంవత్సరాలుగా పేరుకుపోయిన రూ.7500కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ నల్లగొండ విభాగ్ కన్వీనర్ సురభి మణికంఠ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఏబీవీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పొడుస్తుందన్నారు. అనంతరం ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆవుల సంపత్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, ఫీజు నియంత్రణ చట్టాన్ని తెచ్చి కార్పొరేట్ విద్యాసంస్థల వ్యాపారాన్ని అరికట్టాలని, గురుకుల హాస్టల్స్‌కు పక్కా భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో విభాగ్ హాస్టల్ కన్వీనర్ తానాజీ, కార్యాలయ కార్యదర్శి నిఖిల్, మల్లేష్, చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



మునుగోడు : మాట్లాడుతున్న సీఐ వెంకటయ్య

మునుగోడు : గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని చండూరు సీఐ వెంకటయ్య సూచించారు. మంగళవారం మండల పోలీస్‌స్టేషన్‌లో మండల శాంతి సంఘం సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. హిందు, ముస్లింలు స్నేహా సంబంధాలతో కొనసాగుతూ ప్రతి ఉత్సవాన్ని ఆనందంగా జరుపుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, హిందు, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

కట్టంగూర్ : గణేష్ ఉత్సవాలను ఉత్సవ కమిటీ సభ్యులు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ ఎస్.శ్రీను అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అన్ని గ్రామాల పెద్దలు, పలు పార్టీల రాజకీయ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వినాయక ఉత్సవాలను నిర్వహించే ఉత్సవ కమిటీ సభ్యులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది, కమిటీ సభ్యులు ఉన్నారు.

శాలిగౌరారం : వినాయక నవరాత్రోత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని మండల ఎస్‌ఐ సైదులు కోరారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినాయక, దసరా పండుగల నేపథ్యంలో మండలంలోని రౌడీషీటర్లు, సమస్యాత్మక వ్యక్తులకు ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎలాంటి గొడవలు, అల్లర్లలో పాల్గొనవద్దని, అలాగే వాటిని ఇతరులతో ప్రోత్సహించవద్దని హెచ్చరించారు. అనంతరం వారిని తహసీల్దార్ యాదగిరి ఎదుట బైండోవర్ చేశారు.

ముగిసిన దర్వేశిపురం ఆలయ పాలకమండలి పదవీకాలం

కనగల్ : మండలంలోని దర్వేశిపురం శ్రీరేణుక ఎల్లమ్మ దేవస్థాన పాలకమండలి పదవీకాలం ఈనెల 2తో ముగిసినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి జల్లేపల్లి జయరామయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పైఅధికారుల నోటిఫికేషన్ ప్రకారం కొత్త పాలకమండలిని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

విద్యార్థులకు అవగాహన

కనగల్ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ విష్ణుమూర్తి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో మత్తు పదార్థాల నిర్మూలనపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత మాదకద్రవ్యాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో పాఠశాల, పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులపై దాడిని ఖండించాలి

చిట్యాల : ఖమ్మంలో వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన బీఆర్‌ఎస్ మాజీ మంత్రులు హరీష్‌రావు, జగదీష్‌రెడ్డి, మాజీ ఎంపీ నామా నాగేశ్వరావు వాహనాలపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని ప్రతిఒక్కరూ ఖండించాలని బీఆర్‌ఎస్ మండల నాయకులు కందాటి రమేష్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వరద బాధితులను ఆదుకోకుండా అడ్డుపడటం తగదన్నారు. కాంగ్రెస్ నాయకులు గుండాగిరి మాని వరద సహాయ చర్యల్లో పాల్గొనాలన్నారు.

రాళ్లదాడి సరికాదు

నార్కట్‌పల్లి : ఖమ్మంలో వరద బాధితులను పరామర్శించి సహాయం చేసేందుకు వెళ్లిన బీఆర్‌ఎస్ మాజీ మంత్రులపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం సరికాదని జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రేగట్టే మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిపాలన చేతకాక సహాయం చేసే వారిపై దాడులు పూర్తి ఆక్షేపనీయమన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన అన్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకోవాలి

నల్లగొండ క్రైం : విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని ఎంచుకోవాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, ఆర్డీఓ రవి అన్నారు. మంగళవారం పట్టణంలోని బొట్టుగూడ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కష్టపడి చదివించిన తమ తల్లిదండ్రులకు సమాజంలో గొప్ప గౌరవం తీసుకురావాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ శంకర్, పల్‌రెడ్డి రాంరెడ్డి, నర్సింహారెడ్డి, హెచ్‌ఎం శంకర్, పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు



సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

నకిరేకల్ : ఉపాధిహామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఆర్‌డీఓ వై.శేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు ఉపాధిహామీకి సంబంధించిన 7రికార్డులను తనిఖీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో విజిలెన్స్ జిల్లా అధికారి వేణుగోపాల్, క్వాలిటీ కంట్రోల్ స్టేట్ ఆఫీసర్ గౌరీ, షఫీద్దున్, యాదగిరి, ఏపీఓ రమణయ్య, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.